# స్నేహం కన్న తీయనిది

ద్విభాష్యం రాజేశ్వరరావు

విశ్వనాధం ‘రాజుపాలెం’ జంక్షన్‌లో బస్సు దిగేడు.

పై మీది వుత్తరీయం సవరించుకొని చుట్టూ కలయజూసాడు. ఎడంగా రోడ్డు అవతల రావి చెట్టు క్రింద విశ్రాంతి తీసుకొంటున్న నలుగురు రిక్షావాళ్ళు ఒక్కసారిగా లేచివచ్చి అతణ్ణి చుట్టుముట్టారు. అందులో ఒకడు చొరవగా ‘ఎక్కడికి వెళ్ళాలి బాబూ!’ అంటూ విశ్వనాధం చేతిలోని సంచి అందుకొన్నాడు.

“రాజుపాలెం వెళ్ళాలి” అన్నాడు విశ్వనాదం.

“ఎక్కండి బాబూ” అంటూ రిక్షా సీటు చేతిగుడ్డతో తుడిచి సరిచేసాడు. సంచీని ఒకవారగా సీటుమీద పెట్టాడు.

“ఎంతివ్వమంటావ్?”

“తమకు తెలియందేముంది? రెండు రూపాయలు!” అన్నాడు రిక్షావాడు.

“రూపాయన్నర ఇస్తాను!”

“కట్టలేం బాబూ!” అన్నాడు రిక్షావాడు. తనేకాదు, ఎవరూ రిక్షా కట్టరన్న ధ్వని సూచిస్తూ. విశ్వనాధం కొంతసేపు మాట్లాడలేదు.

మళ్ళీ రిక్షావాడే అన్నాడు—“తమలాంటి పెబువులు మాలాంటి పేదోళ్ళ కష్టం సూడాల!”

విశ్వనాదం దీర్ఘంగా నిట్టూర్చి ‘సరే పద!’ అంటూ రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా ‘జంక్షను’ వదలి మట్టిరోడ్డు పట్టింది. విశ్వనాధం రిక్షాలో సర్దుకొని కూర్చున్నాడు. మనసులో రిక్షావాడి మాటలు మననం చేసుకొన్నాడు.

“అతని దృష్టిలో తనో ప్రభువు! తనెక్కింది రిక్షాకాదు, పల్లకీ కాబోలు!”

ఆలోచనలకు నవ్వు వచ్చింది.

‘తనా’ చదువుకొనే పిల్లల దృష్టిలో బతకలేని బడిపంతులు! భార్య కాంతమ్మ దృష్టిలో బతకటం చేతకాని బడిపంతులు! కూతురు లక్ష్మి దృష్టిలో తనకి ఎప్పటికీ పెళ్ళిచెయ్యలేని ఓద బడిపంతులు! అలాంటి తను-రిక్షావాడి కష్టం చూడాలి! తన కష్టం ఎవరు చూస్తున్నారు? ఏడాది పొడుగునా పాఠాలు చెప్పించి రావల్సిన ‘ఎరియర్సు’ ఇవ్వని స్కూలు కమిటీవారా? ఎంత జాగ్రత్తగా పాఠాలు చెప్పినా, సర్కారు వారి బహుమతులు పొందినా, ఇంకా ఏ టీచింగు నోట్సో సరిగా లేదని వంకలు పెట్టే హెడ్మాస్టరా? తమ పిల్లలకు ప్రైవేట్లు చెప్పించుకొని నెలాఖరున డబ్బులు ఎగవేసే పిల్లల తల్లిదండ్రులా? ఎవరు చూస్తున్నారు తన కష్టం? కాని, తను రిక్షావాడి కష్టం గమనించాలి.

దీర్ఘంగా నిట్టూర్పు వదలి చుట్టూ కలయ చూసాడు, విశ్వనాధం.

రోడ్డుకు ఇరువైపులా వున్న సర్వేచెట్లు, చిన్నచిన్న పొదలు, మెల్లగా వెనక్కి కదిలిపోతున్నాయి. ఎండ తీవ్రత రానురాను హెచ్చవుతోంది. కుడిప్రక్కగా ఎండిపోయిన కొండవాగు! ఎండకు వాగులోని పొడిఇసుక తమాషాగా మెరుస్తోంది. వాగుకు అవతలి

పైపున దట్టమైన మామిడితోపు! ఇంకా వెనుక దూరంగా పచ్చని కొండలు. అంతా ఏజన్సీ ఏరియా? నిండా ప్రకృతి సంపద!

రిక్షా గతుకుల్లో పడుతూ లేస్తూ వెళ్తోంది! పెద్ద గోతిలో పడినపుడల్లా రిక్షా సీటు ముందుకు జారుతోంది. వెనక్కి సర్దుకొని కూర్చున్నాడు విశ్వనాధం. చేతిసంచి పడి పోకుండా ఒక మూలగా సర్దేశాడు.

రాజుపాలెంలో సుందర్రామయ్య వున్నాడు. సుందర్రామయ్యా, తను చిన్ననాటి స్నేహితులు. వీధి అరుగుబడి నాటినుండి కలిసి అధ్యయనం చేసారు. ఒకే కంచంలో తిన్న రోజులు కూడా వున్నాయి. ఒకే మంచంమీద నిద్రపోయిన వతు పెరిగేరు. స్కూలుకు వెళ్ళినా, ఎగ్గొట్టి తోటల్లో తిరిగినా కలిసే చేసారు. ఒకనాడు 'ఈమని' వారితోటలో సువర్ణరేఖ మామిడి పళ్ళు తాను చెట్టెక్కి తెంపుతూవుంటే మిగిలిన పిల్లలు ఏరుకుంటున్నారు. ఆ సమయంలో తోటకాపు వస్తే అందరూ పారిపోయేరు ఒక్క సుందర్రామయ్య తప్ప! తామిద్దరూ కలిసి వాడిచేత తన్నులు తిని యింటికి తిరిగి వచ్చేరు. స్నేహానికి ప్రాణమిచ్చే మనిషి సుందర్రామయ్య.

తాను స్కూలు ఫైనలు అయ్యాకా టీచరు ట్రైనింగ్ పూర్తిచేసి జీవితంలో బడిపంతులుగా స్థిరపడిపోయేడు. ఈ ముప్పై రెండేళ్ళ టీచరుగిరీ తనకో చిన్న పెంకుటింటినీ, బేంకులో రెండువేలరూపాయల ఎకవుంటునూ, అనుక్షణం తన అసమర్థతను ఎత్తిచూపే భార్య కాంతమ్మనూ, వివాహానికి ఎదిగి గుండెలమీద కుంపటిలా తయారయిన లక్ష్మినీ మిగిల్చింది.

సుందర్రామయ్య చాలా తెలివైనవాడు. అందుకే స్కూలు ఫైనల్ తర్వాత టీచరు ట్రైనింగ్ అవలేదు. చదువు మానేసి వ్యాపారంలోకి దిగాడు. చిన్నచిన్న వ్యాపారాలు చాలా చేసేడు. బొగ్గులకొట్టు లగాయితూ బట్టలకొట్టు వరకు అన్ని రకాల వ్యాపారాలు చూసేడు. కన్యాకుమారి మొదలు కటక్‌వరకూ అంతా కలయతిరిగేడు. వ్యాపారానికి కావల్సిన జ్ఞానం చాలా సముపార్జించుకొన్నాడు. అతడు చేసిన ఏ వ్యాపారంలోనూ నష్టపోయినట్లు తను వినలేదు. వ్యాపారంలో కాస్త నిలదొక్కుకున్నాకా వివాహం చేసుకొన్నాడు. తన పెళ్ళికంటే మూడేళ్ళముందే అతని పెళ్ళి అయింది. తరువాత ఏడెనిమిదేళ్ళకు ఏలూరు వదిలి దూరంగా ఈ ఏజన్సీ ప్రాంతానికి వచ్చేసి కలప వ్యాపారం ప్రారంభించేడు. తరువాత చాలా సంవత్సరాలు తామిద్దరూ కలియలేదు. ఉత్తరాలు వ్రాసుకొనే అలవాటు ఇద్దరికీ శూన్యమే!

నాలుగేళ్ళ క్రితం తాను ఏదో పనిమీద విశాఖపట్నం వస్తే అక్కడ బస్టాండులో కనిపించాడు సుందర్రామయ్య! ఖరీదయిన బట్టల్లో తళతళలాడిపోతున్నాడు. చేతి వేళ్ళకు మెరిసే వుంగరాలు! తాను రాజుపాలెంలో వున్నట్లూ, చుట్టూ అడవిలోని కలప అమ్మకం కాంట్రాక్టుకు తీసుకున్నట్టూ చెప్పేడు. వ్యాపారం వేల పరిధి దాటి లక్షల పరిధిలో పడినట్లు అతని మాటలవలన అర్థం అయింది. తనను గురించి వివరాలన్నీ చాలా ఆప్యాయంగా అడిగి తెలుసుకొన్నాడు. 'నీకు తీరికయినప్పుడు రాజుపాలెం వచ్చి మా యింట్లో వారంరోజులు వుండి వెళ్ళు' అంటూ ఆహ్వానించాడు. వాడి స్థితికి ఆనాడు చాలా గర్వించాడు తాను. అంతలోనే తను ఎక్కాల్సిన బస్సు వస్తే వాడిదగ్గర సెలవు తీసుకొన్నాడు.

ఆ తర్వాత ఈ మధ్యలో మళ్ళీ అతడి వివరాలు తెలియలేదు. సుమారు ఆరు నెలల క్రితం తమ చిన్ననాటి స్నేహితుడు ప్రకాశం ఏలూరు వచ్చాడు. అపుడు మాటల సందర్భంలో 'సుందర్రామయ్యకి ఒక కొడుకున్నాడు. కుర్రాడు బాగానే వుంటాడు. మీ లక్ష్మికి మంచి ఈడుగా వుంటాడు. నీ కూతురి అందం ఏంతక్కువ కాదుగదా! పెళ్ళి చేసుకోమని అడగరాదూ!' అన్నాడు.




ఆ మాటల్ని అప్పట్లో తాను పెద్దగా పట్టించుకోలేదు. కాని కాంతమ్మ మటుక ఆ మాటలు విని-మహదానందం పొందింది. ఆ నాటినుండి ఈ సంబంధానికి ప్రయత్నించమని చెవిలో యిల్లు కట్టుకుని పోరు ప్రారంభించింది. కయ్యమయినా వియ్యమయినా సమానులతోనే సాధ్యమవుతుందని నమ్మేవాడు తను! కాని, భార్య మాటల్లో కూతురి సుఖాన్ని దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే మటుకు స్వార్ధం అడ్డు నిల్చింది.

'పోనీ సుందర్రామయ్యను ఈ విషయమై కదిపి చూస్తేనో '' అనిపించింది కొద్ది దినాల తర్వాత. రానురాను, ఆ ఆశ బలవత్తరమై.మదిలో నిలిచిపోయింది. కూతురుకి డబ్బున్న సంబంధం చేయాలనే కోరిక మొగ్గ తొడిగింది.

తన కూతురు లక్ష్మి చాలా అందంగా వుంటుంది. చిదిమి దీపంపెట్టుకోవచ్చు. తన ఆస్థిని చూసి కాకపోయినా లక్ష్మి అందాన్ని చూసి అయినా సుందర్రామయ్య తన కొడుక్కి చేసుకోవచ్చు. ఈ సంబంధం చేస్తే లక్ష్మి సుఖపడుతుంది. అసలు ఆమె తన యింట పుట్టవలసిన పిల్లకాదు. ఏ భాగ్యవంతుల ఇంటనో పుట్టి సర్వభోగాలు అనుభవించాల్సిన లక్ష్మీ కళ ఆమె ముఖంలోవుంది.

సుందర్రామయ్యను ఈ సంబంధానికి వప్పిస్తే తన జన్మ ధన్యమయినట్లే! తనవద్ద రెండువేల రూపాయలున్నాయి. మరో రెండు వేలు అప్పుచేస్తే వివాహం జరిపించవచ్చు. ప్రావిడెంటు ఫండుతో అప్పు తీర్చి, పారెయ్యొచ్చును. ఈ పెళ్లితో తన బాధ్యత తీరిపోతుంది. స్వంత యింట్లో 'పెన్షన్' డబ్బులతో తనకూ భార్యకు రోజులు వెళ్ళకపోవు!

ఆలోచనల్లో మునిగిన విశ్వనాథానికి ఊళ్ళోకి చేరుకున్న సంగతే తెలియలేదు. 'ఎవరింటికి వెళ్ళాలిబాబూ!' రిక్షావాడి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు. "సుందర్రామయ్యగారింటికి!"

రిక్షావాడు దిగి మెల్లగా గోతుల్లోంచి బండిని నడిపిస్తున్నాడు.

సుందర్రామయ్యకు జున్ను అంటే చాలా యిష్టం. భార్యతో తానీ విషయం చాలాసార్లు

మాటల సందర్భంలో చెప్పేడు. నిన్న వుదయం పక్కింటి వాళ్ళ గేదె ఈనింది. వాళ్ళ దగ్గర జున్ను పాలు తీసుకొని జున్ను వండి చిన్న కేరియర్‌లోపెట్టి యిచ్చింది భార్య. "మీ స్నేహితుడికి ఈ జున్ను యివ్వండి సంతోషిస్తాడు!" అంది.

జున్ను కేరియరు ఒలికిందేమోనని సంచీ సర్దిచూసేడు విశ్వనాథం.

శ్రీకృష్ణుని వద్దకు సంపదలకోసం బయలు దేరిన కుచేలుని స్థితి జ్ఞప్తికి వచ్చింది. కాక పోతే మిత్రునికి ఇవ్వబోయేవి అటుకులుకావు. అతనికి అతి ప్రియమైన జున్ను! అడగ బోయేవి సంపదలుకావు. అంతకుమించిన సంబంధం'

నవ్వుకున్నాడు తనలో తనే!!

రిక్షా ఓ పెంకుటింటిముందు ఆగింది.

"దిగండి బాబూ!" అన్నాడు రిక్షావాడు.

విశ్వనాథం రిక్షా దిగేడు. ఇల్లు చూసేసరికి అతనికి అనుమానం వచ్చింది.

"కలప వ్యాపారి సుందర్రామయ్యగారి ల్లేనా?" మరోమారు అడిగేడు.

"అవును బాబూ! ఇదే'' అంటూ రిక్షా వాడు తనకు రావల్సిన డబ్బులు తీసుకొని వెళ్ళిపోయాడు.

మెల్లగా లోగిలి మెట్లెక్కి తలుపుతట్టేడు.

తలుపు తెరుచుకొంది.

ఎదురుగా సుందర్రామయ్యగారి భార్య శేషమ్మ! ఆమెను చూసి చాలా కాలమైనా గుర్తుపట్టగలిగేడు. ఆమెలో వార్ధక్యం నీడలు అప్పుడే బాగా పడుతున్నాయి. తల అక్కడక్కడ నెరిసిపోయింది. ఆవిడ తనవంక గుర్తుపట్టలేనట్లుగా చూస్తూ వుండిపోయింది.

"నేను విశ్వనాథాన్ని! ఎలూరునుండి వస్తున్నా'' అన్నాడు.

"మీరా! రండి. చూపు సరిగా ఆనక గుర్తించలేకపోయాను.'' అంటూ లోనికి దారి తీసింది. 'కూర్చోండి' అంటూ కుర్చీ చూపిం చింది. వంటింట్లోకి వెళ్ళి గ్లాసుతో దాహం తీసుకువచ్చింది.

అంతలోనే సుందర్రామయ్య లోపలినుండి వచ్చాడు.

"ఎరా! ఇంత కాలానికి గుర్తువచ్చానన్న మాట'' అంటూ ఆప్యాయంగా కౌగలించు కొన్నాడు విశ్వనాథాన్ని.

"వీడు తనని మరచిపోలేదు'' అను కొన్నాడు విశ్వనాథం.

కాని, వీడిలో ఈ మార్పేమిటి?

మెడలో తళతళలాడే గొలుసుతో తెల్లని ఆ పులిగోరు పతకం ఏది? చేతివేళ్ళకు ధగ ధగ మెరిసే రాళ్ళతో బంగారపు టుంగరా లేవి?

సుందర్రామయ్య యిలా అయిపోతూ దేమిటి?

తను నాలుగేళ్ళక్రితం చూసిన సుందర్రా మయ్యకు హఠాత్తుగా పధ్నాలుగేళ్ళ వయసు పెరిగిందా?

కనులవెనుక ఆ పట్టుదల, నిశ్చలతపోయి, ఆ దీనత్వం ఎలా చోటుచేసుకొంది?

తన మనసులో ముద్రించుకొన్న సుందర్రా మయ్య రూపానికి బదులు ఏదో కదలిపోయిన ఫొటోను చూసినట్టుంది విశ్వనాథానికి.

"అలా చూస్తున్నావేమిరా?''


"నీలో ఎంత మార్పు వచ్చిందా అని చూస్తున్నా!''

సుందర్రామయ్య చిన్నగా నవ్వేడు.

జీవితంలోని ఒడుదుడుకుల నన్నిటినీ జీర్ణించేసుకొని, ఎంతటి కష్టాన్నయినా స్వీక రించటానికి సిద్ధపడిన చిరునవ్వులా అనిపిం చింది విశ్వనాథానికి. తరువాత తన భార్య గురించి, లక్ష్మిని గురించీ వివరాలు అన్నీ అడిగేడు సుందర్రామయ్య. అతడి మాటల్లో తన ఎడల ఎంతో అనురాగం ధ్వనించింది.

శేషమ్మ వంటింట్లోంచి వచ్చి "మీరు మాటల్లో పడితే ఏమీ గుర్తుండదు. అన్నయ్య

(౭) చిత్రవిజ్ఞానం



పురాతన వాబిలోనియాలోని ఓ శిలాఫలకం మీది లిపి యిది. దీని అర్థం:

క్సర్‌క్సస్ మహారాజు రాజులకు రాజు, అఖీమెనీడ్ రాజయిన డారియస్ కొడుకు.

గార్ని కాళ్ళు చేతులు కడుక్కోమనండి! భోజనం చేస్తారు" అంది.

విశ్వనాథం వూహించుకువచ్చిన దానికీ, ఈ యింట్లో పరిస్థితులకు ఎంతో తేడా కన్పిస్తోంది. ఇంట్లో నౌకర్లు ఎవరూ కనిపించటంలేదు. సుందర్రామయ్యే స్వయంగా నూతివద్దకు వచ్చి నీళ్ళు తోడేడు.

"ఆకాశంనుండి భగీరధుడు గంగనుక్రిందికి దింపేడు. ఇప్పుడు ఈ ఏజన్సీలో పాతాళం నుండి గంగను జుట్టు పట్టుకొని పైకి లాగాల్సి వస్తోంది." అంటూ బాల్చీ పైకి తీసాడు.

విశ్వనాథం కాళ్ళు కడుక్కొని భోజనానికి వుపక్రమించాడు. సుందర్రామయ్య పక్కన పీట వాల్చుకొని కూర్చొని కొసరికొసరి తిని పిస్తూ చిన్ననాటి కబుర్లు చెప్తున్నాడు. అతని ధోరణి ఏమీ మారలేదు.

"ఆవకాయ కలపకుండా వదిలేశావేం?" అన్నాడు.

"నీకు తెలుసుగా చిన్నతనంలోనూ కారం తక్కువే తినేవాణ్ని!" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ.

"మీ గోదావరి జిల్లా ఆవకాయలా వుండదని భయపడుతున్నావు గాబోలు! శేషమ్మ ఆవకాయ పెట్టటంలో మంచి ఎక్స్‌పర్ట్! ఎంత విశాఖజిల్లాలో వున్నా ఆవకాయలో మటుకు ముందే వున్నాం. ఒకసారి తింటే మరి వదలవు! కాస్త కలుపు!" అంటూ బలవంతాన అన్నం కలిపించాడు.

శేషమ్మ మిత్రుల కబుర్లు వింటూ నవ్వుకొంటూ పక్కన నిలబడి విసురుతోంది.

విశ్వనాథం భుక్తాయాసంతో విస్తరి దగ్గర నుండి లేచాడు.

గదిలోకి వచ్చి తన సంచిలోని కేరియరు తీసి సుందర్రామయ్యకు అందించేడు.

"అందులో ఏముందో చూడు. మా ఆవిడ నీ కోసం చేసి పంపింది!" అంటూ.

ఆత్రంగా కేరియరు విప్పి అమితానందం పొందాడు.

"ఇంకా నా చిన్ననాటి ఇష్టాలు నువ్వు మరచిపోలేదన్నమాట," అన్నాడు. శేషమ్మను కేకేసి "చూడవోయ్! మా చెల్లాయి జున్ను పంపింది. ఏనాడయినా నా కిష్టమైనది నువ్వు

వేసాడు.

తర్వాత మిత్రులిద్దలూ కబుర్లలోకి దిగారు. క్రమంగా మిత్రుని మాటల్లో విశ్వనాధానికి సంగతులన్నీ అవగతమయ్యాయి.

సుమారు ఎనిమిదినెలల క్రితం అడవిలో అగ్నిప్రమాదం సంభవించి సుందర్రామయ్య కలప 'అడితీ' ధ్వంసం అయిపోయింది. అందులో సుమారు రెండు లక్షలవరకూ నష్టం వచ్చింది. దానితో అతడి జీవనగతే మారిపోయింది. అప్పులవాళ్ళు పైనబడటంతో బంగారం, ఇతర విలువైన సామానులు హరించుకు పోయాయి. ఆఖరికి అతడుండే మేడ కూడా అమ్మాల్సి వచ్చింది. ఈ కొద్ది వ్యవధిలోనే అతడి బతుకు బజారుపాలయ్యింది.

సుందర్రామయ్య యీ విషయాలన్నీ తాపీగా వివరించి చెప్పేడు.

"అంత ధైర్యమైన వాడు కనకనే ఈ దెబ్బను తట్టుకొన్నాడు. తనయితే ఈపాటికి గుండె ఆగి చచ్చిపోయి వుండేవాడు." అనుకొన్నాడు విశ్వనాధం.

"నీ కొడుకు ఎక్కడా కనబడ్డేం?"

ఈ సంగతి అడిగేసరికి సుందర్రామయ్య కళ్ళలో నీళ్ళు తిరగటం గమనించేడు.

"నా దగ్గరవుండి వ్యాపారం చూసుకొనేవాడు. ఈ గొడవలొచ్చాకా వుద్యోగంలో చేరాల్సి వచ్చింది. బీహారులో వాడి స్నేహితుడి దగ్గరకు వెళ్ళిపోయాడు. అక్కడ మూడొందలు జీతంమీద ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటికో వందరూపాయలు వంపుతున్నాడు." అని కాసేపు ఆగి "మహారాజు బిడ్డలా పెంచేను. ఆఖరికిలా అయింది. కష్టాలన్నీ నావికావు వాడివే!" అన్నాడు. అతని కంఠం రుద్ధమైంది.

ఇక ఆ విషయం పొడిగించటం ఇష్టంలేక చిన్ననాటి విషయాలమీదకు మళ్ళించాడు విశ్వనాధం.

ఆ రాత్రి అక్కడే గడిపాడు. అయితే, ... మరుగున పడిపోయింది.

ఆ మర్నాడు వుదయం ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

"మరి రెండు రోజులుండి వెళ్ళరాదూ?" అన్నాడు సుందర్రామయ్య. అవుసరమయితే నిజానికి మరో రెండు రోజులుండాలనే వచ్చాడు. కాని వుండటానికి మనసొప్పడం లేదు.

"అబ్బే! శెలవల్లేవు. మళ్ళీ రేపు వుదయం స్కూలుకి వెళ్ళాలి!" అన్నాడు.

"ఓసారి ఇలా వస్తారా?" అంటూ సుందర్రామయ్యను పిలిచింది శేషమ్మ.

అతడు లోనికి వెళ్ళాడు.

విశ్వనాదం సంచీ సద్దుకొంటూ వుండే వంటింట్లోంచి ఆ దంపతుల మాటలు మెల్లగా వినిపిస్తున్నాయి.

"మన అబ్బాయికి వాళ్ళ లక్ష్మిని పెళ్ళిచేసుకొంటే బాగుంటుందండీ! మీ స్నేహితుడికి చెప్పండి. ఆయన నాలుగురాళ్ళు వెనకేసే వుంటాడు" అంటోంది శేషమ్మ మెల్లగా.

"మన యింటికి వచ్చాడు కదా అని యిప్పుడే అడిగితే బాగుంటుందా? నేను మళ్ళీ నెలలో విజయవాడ వెళ్ళాలి. అప్పుడు ఏలూరు వెళ్ళి అడుగుతాను. విశ్వనాదం మంచివాడే! తప్పక సంబంధానికి వప్పుకొంటాడు" అంటున్నాడు సుందర్రామయ్య.

తరువాత దంపతు లిద్దరూ బయటకు వచ్చేరు. "మళ్ళీ నెలలో విజయవాడ రావాలి అపుడు మీ యింటి కొస్తాను." అన్నాడు.

"తప్పకుండా రావాలి!" అన్నాడు విశ్వనాధం.

వాళ్ళిద్దరి దగ్గర శెలవు తీసుకొని రిక్షా ఎక్కేడు. రిక్షా ముందుకు కదిలిపోయింది.

రిక్షాలో కూర్చున్న విశ్వనాధం మనసులో ఇప్పుడు ఒక్కటే ఆలోచన. 'సుందర్రామయ్య వచ్చి అడిగితే తన కూతుర్ని అతని కొడుక్కు చేసుకోనని ఎలా చెప్పాలా?' అని.

***